ప్రజాశక్తి
గురువారం 22 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం



కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్యామలరావును ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి బుధవారం సస్పెండ్ చేశారు. ఒడిశా నుంచి పాతపట్నంకు మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని శ్యామలరావు పట్టుకున్నారు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేయకుండా ఆ వ్యక్తిని వదిలేసేందుకు రూ.ఐదు వేలు లంచం తీసుకున్నాడు. ఈ విషయం ఎస్‌పి దృష్టికి రావడంతో ఆయన శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో ఆ ఘటన వాస్తవమని నివేదిక రావడంతో ఎస్‌పి చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగా అవినీతికి పాల్పడిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. పోలీస్ సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్‌పి హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొత్త క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలి

'ఐలు' ఆధ్వర్యాన న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల వల్ల పౌర హక్కులు, వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లే ప్రమాదముందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, ఎం.అప్పారావు అన్నారు. కొత్త క్రిమినల్ చట్టాల రద్దును కోరుతూ దేశవ్యాప్త ఆందోళనల్లో భాగంగా జిల్లా కోర్టు ఎదుట ఐలు ఆధ్వర్యాన న్యాయవాదులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త క్రిమినల్ చట్టాల్లో భారతీయ న్యాయ సంహిత 2023 (బిఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం 2023 (బిఎస్ఎ) చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వలస పాలకులు తెచ్చిన చట్టాలు మార్చాలని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు కొత్త చట్టాలు తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్తోందని, వాస్తవానికి ఈ చట్టాల్లో బ్రిటిష్ వారి కంటే ప్రమాదకరమైన విధివిధానాలను రూపొందించారని తెలిపారు. ఇటీవలే రాజద్రోహ సెక్షన్ 124ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే, అంతకంటే ప్రమాదకరమైన చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. దీనికితోడు న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా పోలీసులకు విశేష అధికారాలు కట్టబెట్టిందని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లే ఈ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.ఈశ్వరరావు, పి.లక్ష్మీపతి, కూన అన్నంనాయుడు, కృష్ణప్రసాద్, చింతపల్లి సూర్య, శ్రీదేవి పాణిగ్రహి, ఎస్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మృగాళ్లను కఠినంగా శిక్షించాలి

సిఐటియు, ప్రజా, ఉపాధ్యాయ, ఉద్యోగసంఘాల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కోల్‌కతాలో జూనియర్ వైద్యునిపై హత్యాచారం చేసిన మృగాళ్లను కఠినంగా శిక్షించాలని, వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రాణాలు పోసే వైద్యుల ప్రాణాలు తీయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఈ ఘటనతో యావత్ దేశం దిగ్భ్రాంతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య వెనుక డ్రగ్ మాఫియా, సంఘ వ్యతిరేక శక్తులు ఉన్నట్లు కథనాలు వస్తున్నాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి త్వరితగతిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వైద్యులకు, ప్రత్యేకించి మహిళా వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది భద్రతకు సమగ్ర చట్టం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు, సాహితీస్రవంతి, పట్టణ పౌరసంక్షేమ సంఘం, పలు సంఘాల నాయకులు కృష్ణవేణి, ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, కె.శ్రీనివాసు, ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాష్, డి.చందు, టి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్, జనవిజ్ఞాన వేదిక, బ్యాంకు ఉద్యోగుల సంఘం, సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని డైమండ్ పార్కు నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి, ఏడురోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. నిరసనకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి సంఘీభావం తెలిపి దారుణ ఘటనను తీవ్రంగా ఖండించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై దాడులు చేస్తున్న వారిపై ప్రభుత్వాలు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎం.వాగ్దేవి మాట్లాడుతూ ఆరోగ్యశాఖ, హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న మహిళా నాయకురాలు మమతా బెనర్జీ సొంత రాష్ట్రంలో ఇటువంటి దురాగతాలు జరగడాన్ని ఖండించారు. బ్యాంకు ఉద్యోగ సంఘ నాయకులు కరుణకుమారి, హెచ్ఎంల సంఘం నాయకులు అమరవాణి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నివారించాలని డిమాండ్ చేశారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడుల ఘటనలు నిత్యకృత్యం అవుతున్నాయని, మహిళా ఉద్యమాల ద్వారా వీటిని పునరావృతం కాకుండా చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మహిళా భద్రత ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకులు శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి స్వర్ణకుమారి, పూర్వ జిల్లా కార్యదర్శి పి.వసుంధర, కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, పూర్వ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగసంఘాల నాయకులు

పివిటిజి జాతుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పర్టిక్యులర్ వనరబుల్ ట్రైబల్ గ్రూపుల (పివిటిజి) అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఆర్.సుబ్రమణ్యం ఆదేశించారు. గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న పిఎం జన్మాన్ పథకం అమలుతో పాటు ఇళ్ల నిర్మాణాలు, మహిళా శిశుసంక్షేమం, వైద్య ఆరోగ్యం, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, తదితర శాఖలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మందస మండలం చీపి, కొత్తూరు మండలం హడ్డుబంగి, నందిగాం మండలం పెదగురువూరు గ్రామాలను మోడల్ గ్రామలుగా అభివృద్ధి చేయడానికి గుర్తించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు. జిల్లాలో ఉన్న పివిటిజి గ్రామాలను ప్రస్తావించిన ఆయన 534 పివిటిజి హేబిటేషన్లు ఉన్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో 1650 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. గృహ నిర్మాణాలకు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక అందిస్తున్నామన్నారు. ప్రధాన గ్రామాలకు రహదారులు, తాగునీటి సరఫరా, జల జీవన్ మిషన్ ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్, రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్వహణ, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు స్థలాలు గుర్తించినట్లు చెప్పారు. కొన్నిచోట్ల భూ సమస్య ఉందని, వాటిని త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ నగేష్, పంచాయతీరాజ్, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రేపు గ్రామసభలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లావ్యాప్తంగా ఈనెల 23న నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈ సభల్లో ప్రజలంతా పాల్గొనేలా చూడాలని, ఉపాధి హామీ కింద ప్రతిపాదించిన పనులపై విస్తృతంగా ఈ సభల్లో చర్చించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా ఎంపిడిఒలు చర్యలు చేపట్టాలని, ప్రతి నోడల్ అధికారి విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. గ్రామాలను సుస్థిర అభివృద్ధి దిశగా నడిపించే విధంగా ఉపాధి పనులను గుర్తించాలన్నారు. గ్రామసభలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేరోజున గ్రామసభలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సభల్లో అర్థవంతమైన చర్చ జరగాలన్నారు. ప్రతి గ్రామసభకు ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఒ వెంకట్రామన్, డ్వామా పీడీ ఎన్.వి చిట్టిరాజు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- నౌపడ

కళాశాలలు, పాఠశాలలు ప్రాంగణాల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. సంతబొమ్మాళి మండలంలోని నౌపడ, భావనపాడు మెరైన్ పోలీస్ స్టేషన్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు తనిఖీ చేసి, నేరస్తుల వివరాలు పరిశీలించారు. ముఖ్యమైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తుపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్లను తనిఖీ చేసి నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. కాలేజీ రోడ్డులో పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. తీర ప్రాంతంలో నేరాల నియంత్రణ, అక్రమ చొరబాటు దారులపై అప్రమత్తంగా వ్యవహరించాలని మెరైన్ పోలీసులకు సూచించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా కల్పించారు.కార్యక్రమంలో నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి



కొత్తూరు : మూతపడిన దుకాణాలు

బంద్ పాక్షికం

- వర్గీకరణ వద్దు... ఐక్యతే ముద్దు
- దళితసంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

ఎస్‌సి వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపుమేరకు బుధవారం చేపట్టిన భారత్ బంద్ జిల్లాలో పాక్షికంగా జరిగింది. శ్రీకాకుళం నగరంలో దుకాణాలు, పాఠశాలలు, కళాశాలలు యధావిధిగా తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ దళితవాడలను అభివృద్ధి చేయకుండా వర్గీకరణ పేరిట దళితుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. తీర్పును సుప్రీంకోర్టు పున:పరిశీలన చేయాలన్నారు. వర్గీకరణ వద్దని, ఐక్యతే ముద్దు అని నినాదాలు చేశారు. కొత్తూరులో దుకాణాలు మూతపడ్డాయి. పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు. అంబేద్కర్ కూడలి వద్ద దళితసంఘ నాయకులు మానవహారం నిర్వహించడంతో గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు బెంజిమెన్, తొంపల తిరుపతి, వదమ శ్రీను, పడాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ, అంబేద్కర్ కూడళ్ల వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు, సమతా సైనికదళ్ జిల్లా కన్వీనర్ చల్లా రామారావు, ఉపాధ్యక్షులు అక్కురాడ మాధవరావు, గిరిజన సంఘ నాయకులు కొచ్చా శ్రీనివాసరావు, దళిత జెఎసి నాయకులు కురమాన దాలయ్య తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో అంబేద్కర్ కూడలి నుంచి దాసన్నపేట వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం నాలుగు రోడ్ల కూలి వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ నగిరి మోహనరావు, నూతలపాటి బాబూరావు,కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. పొందూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ నిర్వహించిన అనంతరం తహశీల్దార్ రమేష్, ఎస్ఐ పి.వి రమణకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి లక్ష్మి, దళితసంఘ నాయకులు ఎం.సునీల్ కుమార్, ఆర్.గవర్రాజు, ఎస్.రాము, పోతయ్య తదితరులు పాల్గొన్నారు. రణస్థలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రాము తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : నినాదాలు చేస్తున్న దళితసంఘాల నాయకులు

లోక్ అదాలత్‌లో కేసుల రాజీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలని పిలుపునిచ్చారు. కోర్టుల్లో ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. కేసులను రాజీ చేసుకుని కొత్త జీవితం ప్రారంభించడానికి దోహదపడుతుందన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, బ్యాంకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎస్.ఎం ఫణికుమార్ పాల్గొన్నారు.

కాశీబుగ్గలో ఎస్‌పి గ్రీవెన్స్

ప్రజాశక్తి - పలాస

ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్‌పి ఫిర్యాదులు స్వీకరిస్తున్న విషయం విదితమే. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజల వ్యయ, ప్రయాసలను దృష్టిలో పెట్టుకుని, వారికి మరింత చేరువయ్యేలా ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11.30 గంటల నుంచి వినతులను స్వీకరించనున్నారు. ఈ అవకాశాన్ని ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, వజ్రపుకొత్తూరు, మందస, పలాస, నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి మండలాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ బలోపేతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఒలు) బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మెరుగైన, నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేయడానికి ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చును తగ్గించడం ద్వారా రైతులు ఆదాయం పొందేందుకు వీలుంటుందని చెప్పారు. ఇందుకోసం మెరుగైన సాంకేతికత, మార్కెటింగ్ సౌకర్యం తదితర వాటి కోసం సన్న, చిన్న కారు రైతులు ఈ సంస్థలో చేరి భాగస్వామ్యం కావడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. రైతులు పండించే పంటలకు పకడ్బందీ మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్థిక బలంతో పాటు మార్కెట్ అనుసంధానం పెంపొందించుకోవడానికి ఇవి దోహదపడతాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో నాబార్డు, పలు సంస్థల ఆధ్వర్యాన 32 ఎఫ్‌పిఒలు పనిచేస్తున్నట్లు వివరించారు. కొత్తవి ఏర్పాటు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో పాలు, కూరగాయలు, మామిడి, జీడి మామిడి, కొబ్బరితో పాటు ఉద్యానవన పంటల మార్కెటింగ్‌పై దృష్టిసారించాలని సూచించారు. పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, రైతుబజార్లలో రిటైల్ దుకాణాలు ఇవ్వాలని, లైసెన్సులు జారీ సులభతరం చేయాలని ఆయా ఎఫ్‌పిఒలను కోరారు. పెండింగ్ లేకుండా అన్ని రకాల లైసెన్సులు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ, పశు సంవర్ధకశాఖల జెడిలు కె.శ్రీధర్, జయరాజు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, నాబార్డు డిడిఎం కృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శివారు భూములకు నీరందించాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కలుగజేసుకుని వంశధార కాలువలకు షట్టర్లు బిగించి శివారు భూములకు సాగునీరందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వంశధారలో నీరున్నా, రైతాంగానికి అందకపోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. షట్టర్ల కుంభకోణం జరిగి 15 ఏళ్లు గడుస్తున్నా, పాడైపోయిన వాటి స్థానంలో కొత్తవి వేయలేదని విమర్శించారు. మరోవైపు 900 టన్నుల షట్టర్లు గోదాములో తుప్పు పడుతున్నా బిగించడం లేదన్నారు. వంశధార ఎడమ కాలువకు కొత్త షట్టర్లు బిగించకుండా చివర భూములకు నీరు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. హిరమండలం నుంచి టెక్కలి వరకు అన్ని షట్టర్లు, మదుములు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటికి తక్షణమే మరమ్మతులు చేయకపోతే కాలువలో నీరు వెళ్లే పరిస్థితి లేదని చెప్పారు.

ఎడమ కాలువకు 68 పిల్ల కాలువలు, కుడి కాలువకు 37 పిల్ల కాలువలు పూర్తిగా మరమ్మతుకు నోచుకోలేదని విమర్శించారు. వంశధార కాలువను ఆపరేట్ చేయడానికి గతంలో 200 మంది లస్కర్లు ఉండేవారని, నేడు 20 మంది మాత్రమే ఉండడంతో నిర్వహణ కూడా చేపట్టే పరిస్థితి లేదన్నారు. జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వంశధారపై పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార బ్యారేజీ పూర్తయి 50 ఏళ్లు కావడంతో నిర్వహణకు నిధులు కేటాయించక శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కొత్త షట్టర్లు బిగించాలని, ఆధునీకరణ లైనింగ్ చేయాలని, మదుములు, కాలువల మరమ్మతులు చేయాలని, లస్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కొండపేట ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేయించాలని, టెక్కలి మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకాన్ని పనిచేయించి ముఖలింగాపురం వరకు ఉన్న గిరిజన భూములకు నీరు వెళ్లే విధంగా గొట్టాలు వేయాలన్నారు. సమావేశంలో నాయకులు పాలిన సాంబమూర్తి, కొల్లి ఎల్లయ్య, ఉర్జాన లక్ష్మణరావు, హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎమ్మెల్యే అర్జీల స్వీకరణ

రణస్థలం రూరల్ : ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికే వారధి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక బిజెపి కార్యాలయంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే కొన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న బాలాజీ

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

పాతపట్నం : ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెం లో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డార్మెటరీని, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని ఆయన నేరుగా తిని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, మ్యాథ్స్ కెమిస్ట్రీ సబ్జెక్ట్ ఎక్స్పెర్ట్ లక్ష్మి, జ్యోతిశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎరువులను సీజ్ చేస్తున్న ఎఒ ధనుంజయ


62 బస్తాల ఎరువులు సీజ్

కంచిలి: మండలంలోని డి.జి.పురానికి చెందిన ఓ రైతు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 62 బస్తాల ఎరువులను మండల ఎఒ ధనంజయ బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఇంట్లో ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ సోదాల్లో 20- 20-0 - 13 రకం 50 బస్తాలు, 12 బస్తాల డిఎపిని కనుగొన్నట్లు తెలిపారు. వీటిపై రైతును ప్రశ్నించగా... తమ పొలాలకు అవసరమని కొనుగోలు చేసినట్లు తెలిపారని అన్నారు. అయితే ఎరువులు సంబంధించి బిల్లులను చూపించమని కోరగా, బిల్లులు సరైనవి చూపించలేదని తెలిపారు. దీంతో ఎరువులను సీజ్ చేసినట్లు వివరించారు. ఎరువులకు సంబంధించి బిల్లులు సమర్పించినట్లయితే, ఎరువులు తిరిగి రైతుకు స్వాధీనం చేస్తామన్నారు. తనిఖీలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డిసి లక్ష్మణమూర్తి

కొత్త ఓటర్ల నమోదు తప్పనిసరి

లావేరు: కొత్త ఓటర్ల నమోదు తప్పనిసరిగా చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి అన్నారు. బుధవారం లావేరులో బిఎల్ఒలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, పెళ్లయిన, వలస వెళ్లిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించాలన్నారు. వీటిపై బాధ్యతయుతంగా డోర్‌టుడోర్ సర్వే నిర్వహించాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ వై.జోగారావు, డిటి డివిఎస్ మూర్తి, బిఎల్ఒలు పాల్గొన్నారు.


పిహెచ్‌సిలో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

లావేరు: వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు, ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు డిఎస్ఒ వి.ఆర్.నాగేశ్వరరావు, డిపిహెచ్ఎన్ఒ శైలజ అన్నారు, బుధవారం లావేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, బుడతవలస హెల్త్‌అండ్‌వెల్నెస్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని రికార్డులను పరిశీలించారు. అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రతిఒక్కరు తమకు అప్పగించిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యంపై చాలా అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు, పిల్లలు, వృద్ధులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిపిఒ ఎన్‌హెచ్ఎం పి.మురళి, లావేరు పిహెచ్‌సి వైద్యాధికారులు వి.మణిభూషణ్, జె.మౌనిక, పిహెచ్ఎన్ఎంఎస్ సుహాసిని, హెల్త్ సూపర్‌వైజర్ బెనర్జీ, సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


కళాకారులతో కమిటీ సభ్యులు

కళాకారులకు సన్మానం

కవిటి: నిత్యం తమ గాత్రం, సంగీతంతో అలరిస్తున్న పలువురు కళాకారులను చింతామణి ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కళలకు ఎల్లలు లేవని, మండలంలో ఏ మూల కచేరి జరిగినా తమ గాత్రం, సంగీతంతో సేవ చేస్తున్న కళాకారులను సత్కరించుకోవడం సముచితమని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బెందాళం చిట్టిబాబు, లోల్ల రాజేష్, ఆరంగి మధు, బెందాళం రమేష్, పాండవ చంద్రశేఖర్, బెందాళం వెంకటేశ్వరరావు, బెందాళం రమణమూర్తి, ఆరంగి రాజు, భావన రవి, బెందాళం సురేష్, వజ్జ రంగారావు పాల్గొన్నారు.

సమస్యల వలయం

- తాగునీరు గగనం
- రహదారులపై మురుగునీరు

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలోని రెల్లివీధిలో సమస్యలు తిష్ట వేశాయి. సుమారు 80 కుటుంబాలు ఉన్న రెల్లివీధిలో కనీస సౌకర్యాలు లేక అనునిత్యం అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోయారు.

సమస్యలు పరిష్కరించాలి



దశాబ్దాల కాలం గడుస్తున్నప్పటికీ తమ కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదు. సరైన రహదారి లేదు. రోడ్డుకు ఇరువైపుల కాలువలు లేవు. ముఖ్యంగా తాగునీరు పూర్తిస్థాయిలో అందక పోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలి.

- దాలమ్మ, రెల్లివీధి, బూర్జ

తమ వీధులకు సంబంధించి కేవలం రెండు కొళాయిలు మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అయితే రెండు కొళాయిల ద్వారా కేవలం గంట మాత్రమే తాగునీరు సరఫరా చేయడంతో అన్ని రకాల అవసరాలకు తమ కుటుంబాలకు నీరు సరిపోవడంలేదని స్థానికులు పేర్కొన్నారు. దీంతో అనునిత్యం అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తమ వీధుల్లో


రహదారి మధ్యలో ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్డుకు ఇరువైపుల కాలువలు లేకపోవడంతో మురుగునీరు రహదారిపైకి వస్తుండడంతో చెరువును తలపించే విధంగా తయారవుతుందన్నారు. తమ ప్రాంతంలో అపారిశుధ్యం నెలకొందని దీనివలన వ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి కూత వేటు దూరంలో తమ నివాస ప్రాంతం ఉన్నప్పటికీ అధికారులు కనీసం కన్నెత్తయినా చూడడం లేదని వాపోయారు. సమస్యలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న నాథుడు కరువయ్యాడని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారుల స్పందించి తమ సమస్యల పరిష్కారానికి కృషిచేసి తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- మందస

మండలంలోని ప్రత్యేక దృష్టిపెట్టి మైక్రో ఇరిగేషన్‌తో ప్రతి ఎకరాకీ సాగునీరు అందించే విధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వంశధార కాలువను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రతి చేనుకు నీరు... ప్రతి చేతికి పని అని సంకల్పంతో 45 రోజుల పరిపాలనలోనే వంశధార కాలువను బాగు చేసి ప్రతి ఎకరానికీ నీరు అందించే విధంగా పనిచేస్తున్నామని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దానయ్య అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఆమెను ఎంపిపి, సభ్యులు, అధికారులు ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ముందుగా ముందుగా వ్యవసాయశాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు 370 ఎకరాలల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేశామన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ... గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే డబార్‌సింగ్, దామోదర్ సాగరం నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. దీనిపై ఎంపిపి మాట్లాడుతూ కారణలు ఏమైనా రాజకీయాలను పక్కన పెట్టి ఇరిగేషన్‌పై దృష్టి పెట్టాలని అన్నారు. మండలంలో ఇంతవరకు వర్షాభావంపై ఆధారపడడమే తప్ప గిరిజన ప్రాంతాల్లో సాగునీరు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్నారు. డాక్టర్ సంపతరావు మాట్లాడుతూ పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది అనుక్షణం అందుబాటులో ఉంటున్నారని అన్నారు. కుక్క, పాము కాటుకు మందులు అందుబాటులో ఉంటాయన్నారు. మండలంలో 80 మంది గర్భిణులకు ప్రతినెలా 9వ తేదీన తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామీణ తాగునీటి ప్రాజెక్టు అధికారి సతీష్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ 267 గ్రామాలకు గాను, 177 టెండర్లు పూర్తయ్యాయని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ఎమ్మెల్యే మాట్లాడతూ జలజీవన్ మిషన్ పథకం అనేది గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్వీర్యమైందని అన్నారు. ఏదేమైనా చిత్తశుద్ధితో చేస్తున్నామని అన్నారు. ఈ నెల 23న అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించాలన్నారు. అందులో తీర్మానించిన పనుల వివరాలను మండల అధికారులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుమలరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన 2022-2024 మధ్య ఏదైనా డిగ్రీ, బిటెక్, పిజి పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జెన్పాక్ట్ సంస్థ వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పిబి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జెన్పాక్ట్ సంస్థ కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్-వాయిస్ సపోర్ట్ విభాగాల్లో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఈ వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్హతతో పాటు ఇంగ్లీష్ భాషా నైపుణ్యం, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు హెచ్‌ఆర్ రౌండ్, టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ లింక్ https://bit.ly/46Wzqz6 లో రిజిస్టర్ కావాలని, skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు 9988853335, 9550967353, 9704960160 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పొందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీ, ఇంటర్వ్యూ వేదిక వివరాలు ఇమెయిల్ ద్వారా లేదా మెసేజ్ ద్వారా తెలియజేయనున్నట్టు ఆయన తెలిపారు.

గ్రామసభలు నిర్వహించాలి

బూర్జ: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకంలో భాగంగా 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ పనులు గుర్తించి తీర్మానం చేయుటకు ఈ నెల 23 నుంచి గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. ఎపిఒ రాజ్ కుమార్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని 31 పంచాయతీల్లో ఈ నెల 23న గ్రామసభలు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎపిడి మురళీకృష్ణ సూచించారు. ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న పనులు, పురోగతిపై చర్చించాలని తెలిపారు. అలాగే 2024-25 ఏడాదికి గాను గుర్తించిన పనులు, వాటి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మావతి, ఎపిఒ రమణారావు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.


పందిరిరాట వేస్తున్న హారికా ప్రసాద్ దంపతులు

వినాయకచవితికి పందిరిరాట

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వీలుగా మహోత్సవాల్లో తొలి వేడుక పందిరి రాట కార్యక్రమాన్ని నగరంలోని ఇల్లీసుపురం జంక్షన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారికా ప్రసాద్, లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి జోనల్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది వేడుకలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇల్లీసిపురం మెగా యూత్ సభ్యులు అప్పు, వాసు, భాస్కర్, నాని, మోహన్, నోము తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక ఎన్ఆర్‌జెసి కార్యాలయంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సభ్యులు హాజరైనప్పటికీ పెద్దగా ఎవరు సమస్యలు ప్రస్తావించలేదు. చాపర సమీపంలోని బంకు వద్ద రోడ్డు గోతులు పూడ్చాలని సభ్యుల అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పడాల చంద్రకుమారి, తహశీల్దార్ నందిగామ హనుమంతరావు, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరమ్మ


క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

క్రీడలతో ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. నగరంలోని శాంతినగర్ కోలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఆగస్టు 10, 11 తేదీల్లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి స్విమ్మింగ్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న పోలీసు ఉద్యోగుల పిల్లలు చౌదరి సుశాంత్, కె.అభిరామ్, కె.చిత్ర, ఎం.నికేష్, ఎం.పురందేశ్వరి విజేతలుగా నిలిచారు. నాలుగు విభాగాల్లో సుశాంత్ బంగారు పతకాలు సాధించగా మిగిలిన వారు బంగారు, వెండి, కాంస్యం పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి స్విమ్మిగ్ పోటీలో గెలుపొందిన పోలీస్ సిబ్బంది పిల్లలు, స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్‌పి మాట్లాడుతూ స్విమ్మింగ్ క్రీడ ద్వారా శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాయామం లభిస్తుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం హర్షనీయమన్నారు. క్రీడా కారులను ప్రోత్సహించడానికి అసోసియేషన్ తీసు కుంటున్న చొరవను అభినందించారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణిం చాలని ఎస్‌పి ఆకాంక్షించారు. రాష్ట్ర,జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు హారిక ప్రసాద్, ఉపాధ్యక్షులు జోగినాయుడు, అంతర్జాతీయ స్విమ్మర్ కాంతారావు, క్రీడాకారులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

విశ్రాంత డిఇఒ మల్లేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విద్యార్థులు మొట్టమొదటిగా ఉద్యోగమా? వ్యాపారమా? నిర్ణయించుకొని ఆ దిశగా జీవితంలో కృషి చేయాలని విశ్రాంత డిఇఒ డాక్టర్ బలివాడ మల్లేశ్వరరావు సూచించారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు 'ఎంటర్ పెన్యూర్ షిప్ యాజ్ కెరియర్' అనే అంశంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్లో పిల్లలకు వ్యాపారలు చేయాలని తల్లితండ్రులు ప్రోత్సహిస్తారని, ఆంధ్రాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారం చేసేందుకు సులభంగా ఆర్థికసహాయం చేస్తున్నాయన్నారు. ఉద్యోగి పరిమితికి లోబడి వ్యవహరించాలని, అదే వ్యాపారైతే ఆకాశమే హద్దుగా ఎదుగుదలకు కృషి చేయవచ్చునని అన్నారు. ధైర్యం, పట్టుదల ఉన్నవారు వ్యారంలో రాణిస్తారని పేర్కొన్నారు. పెన్సిల్ ముల్లుపై 26 అక్షరాలు 17 నిముషాల్లో చెక్కి 'బుక్ ఆఫ్ ఇండియాలో స్థానం సంపాదించిన తృతీయ ఏడాది ఈసిఈ విద్యార్థికి ఐతమ్ అందించిన రూ.10వేల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. సదస్సులో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐఐసి డీన్ డాక్టర్ జి.సతీష్‌కుమార్, ఈసిఈ హెచ్ఒడి డాక్టర్ వి.అశోక్‌కుమార్, అధ్యాపకులు వి.రఘువీర్, జె.సురేష్, గిరీష్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న నాగేశ్వరరావు


మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

జ్వరాలపై అప్రమత్తం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ అధ్యక్షతన సీజనల్ వ్యాధుల నివారణపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు హెల్త్ సెక్రెటరీస్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలతో మాట్లాడారు. వార్డుల్లో ప్రబలుతున్న జ్వరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో, నీరు నిల్వ ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయాలన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించాలన్నారు. ఇందులో డ్వాక్రా సంఘాల సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. భోజన, టిఫిన్ హోటల్, తినుబండారాలపై మూతలు పెట్టాలని సంబంధిత యజమానులకు ఆదేశించారు. వేడినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.


బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ సర్వేల్లో పాల్గొన్న బిఎల్ఒలకు బకాయిపడిన వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్‌డిఒ సుదర్శన దొరని బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా సర్వే, ఎన్నికల ముందు, తర్వాత బిఎల్ఒలతో వివిధ రకాల సేవలను వినియోగించుకున్నారని అన్నారు. వినియోగించుకున్న సేవల నిమిత్తం రావల్సిన ఆర్థిక లావాదేవీలు బకాయిలో ఉన్నాయన్నారు. గడచిన నాలుగేళ్లుగా బకాయిలు చెల్లించడంలో తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పగించిన ప్రతి పనినీ బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. అయినా తమకు రావల్సిన బకాయిలు చెల్లించడం లేదన్నారు.


వినతిపత్రం అందిస్తున్న బిఎల్ఒలు

నియోజకవర్గంలో 329 మంది బిఎల్ఒలు ఉన్నారని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో జి.విజయ్‌కుమార్‌వర్మ, ధనుంజయరావు, రాము, ఢిల్లేశ్వరరావు, కోట అనిల్, ప్రభాష్ ఉన్నారు.


పూడికలను తొలగిస్తున్న రైతులు

పిల్లకాలువలో పూడికతీత

ప్రజాశక్తి వజ్రపుకొత్తూరు

రైతులు శ్రమదానంతో పిల్లకాలువను బాగు చేసుకున్నారు. ఈ ఏడాది వంశధార నీరు సకాలంలో రావడంతో సీతాపురం ఎర్ర చెరువు లో జలకళ సంతరించుకుంది. ఎర్ర చెరువు నుండి సాగునీరు విడిచిపెట్టారు. అయితే పిల్ల కాలువలో పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో పొలాలకు సాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో రైతులు బుధవారం శ్రమదానం చేశారు. ఈ వేసవిలో పిల్లకాలువల్లో ఉపాధి పనులు అరకొర జరగడంతో శ్రమదానం చేయవలసి వస్తుందని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది సకాలంలో వంశధార నీరు చేరడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తుంది. వంశధార నీరు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో తమ్మినాన అప్పారావు, టి.రామయ్య, వాసు, దుంపల తిరుపతిరావు, గొల్లపల్లి ధర్మారావు, యదళ్ల రాజారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



పాముకాటుతో మహిళ మృతి


వరలక్ష్మి (ఫైల్)

లావేరు : మండలంలోని గుర్రాల పాళెంలో పొలం పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలి బాధా వరలక్ష్మి (60) పాము కాటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు వరలక్ష్మి ఎప్పటి మాదిరి రోజు పొలం పనులకు వెళుతున్నట్టుగానే బుధవారం ఇంటి నుంచి అందరితో కలిసి పొలంలోని వ్యవసాయ పనులకు వెళ్తుండగా పనిచేసే ప్రదేశానికి చేరుకొనే క్రమంలో సర్వే తోటలో నుంచి వెళ్తున్నారు. ముందు నడుస్తున్న వరలక్ష్మి కాలుకి పాము కాటు వేసింది. వెంటనే వెనుక వస్తున్న తోటి మహిళలకు చెప్పగా వారు గ్రామస్తులకు తెలపడంతో గ్రామస్తులు వచ్చేసరికి వరలక్ష్మి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయింది. వెంటనే 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త రమణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటివరకు గ్రామంలో అందరితో సరదాగా కలిసిమెలసి ఉన్న తోటి మహిళ ఇలా పాముకాటుకు బలై మృతి చెందడంతో వారు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. లావేరు పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


దుర్గారావు మృతదేహం

గల్లంతైన వ్యక్తి మృతి

పోలాకి: మండలంలోని వెదుళ్లవలసలో మంగళవారం సాయంత్రం స్నానానికి దిగి గల్లంతైన అమలాపురం దుర్గారావు (26) మృతదేహం బుధవారం లభ్యమైంది. స్నానానికి వెళ్లిన దుర్గారావు రాత్రైనా ఇంటికి రాకపోవడంతో గ్రామస్తులు చెరువులో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం చెరువులో గజ ఈతగాళ్లు, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 5 గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీసి ఒడ్డుకు చేర్చారు. మృతదేహంపై తల్లి సరస్వతి, కుటుంబ సభ్యులు పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. వారంరోజుల్లో మృతుడి అన్నయ్య వివాహం జరగాల్సి ఉండగా ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు సోకసముద్రంలో మునిగిపోయారు. విఆర్ఒ శ్రీనివాసరావు సమక్షంలో పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామ పెద్దలు కరిమి రాజేశ్వరరావు, ఎం.వెంకట అప్పలనాయుడు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మాజీ వైస్ ఎంపిపి మృతి


అన్నపూర్ణమ్మ (ఫైల్)

మెళియాపుట్టి : మండలంలోని పద్ద గ్రామానికి చెందిన సవర అన్నపూర్ణమ్మ (48) బుధవారం సాయంత్రం మృతి చెందారు. కొన్నాళ్లు అనారోగ్యానికి గురి కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమె మెళియాపుట్టి మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా, వైసిపి విభాగంలో పలు పదవులు నిర్వహించారు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈమె భర్త ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఆమె మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వడదెబ్బతో యాచకురాలు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు: తీవ్ర ఎండ కారణంగా వడ దెబ్బ తగిలి బుధవారం నువ్వలరేవులో యాచకురాలు పోతల శాంతమ్మ (55) మృతి చెందినట్లు ఎస్ఐ సిహెచ్.రామారావు తెలిపారు. బెండి గేటు కూడలిలో 40 ఏళ్లుగా పాకలో నివాసం ఉంటూ యాచక వృత్తితో పాటు కరివేపాకు అమ్ముతూ జీవనం సాగించేది. నువ్వలరేవులో కరివేపాకు అమ్మడానికి ఉదయం వెళ్లి తీవ్ర ఎండకు స్పృహ కోల్పోయి పడిపోయింది. విగతజీవిగా పడి ఉన్న యాచకురాలిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారు పాతపట్నం వలస వెళ్లి అక్కడ జీవనం సాగిస్తున్నారు. భర్త పోతల గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్.రామారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్‌తో ఉన్నత విద్య

సరుబుజ్జిలి: సార్వత్రిక విద్యా విధానం ద్వారా పది, ఇంటర్ చదువుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, డి.బాలరాజు తెలిపారు. బుధవారం ఎంఇఒ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ విద్యా విధానంపై అవగాహన సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ వెంకట సాయి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, సిఆర్ఎంటి బెండి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

పాతపట్నం: మండలంలోని తామరకు చెందిన పడ్డాన జనార్ధనరావు, శకుంతల దంపతుల కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. గత 15 ఏళ్లుగా తామరను దత్తత తీసుకుని ఆడ పడుచులకు ఆర్థికసాయం చేస్తున్నారు. ఈయనతో పాటు తీమర సర్పంచ్ ఇప్పిలి ధనుంజయ, పడ్డాను దిల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

సిఎంను కోరిన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. అమరావతిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్ర అందజేశారు. పొందూరు మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల శాశ్వత భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆమదాలవలస మండలంలోని తొగరాం డిగ్రీ కళాశాల, సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస జూనియర్ కళాశాలలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. బూర్జ మండలంలోని నారాయణపురం ఆనకట్ట ఆధునీకరణ పనులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


అవగాహన కల్పిస్తున్న ప్రసన్నరాణి

బాలికల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- లావేరు

ప్రతి బాలిక బాలికల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న రాణి అన్నారు. బుధవారం మురపాక కెజిబివి పాఠశాలలో వన్ స్టాప్ సెంటర్ల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలను చదివించడంతో పాటు వారి స్వీయ రక్షణకు విద్యార్థినులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస తదితర వాటిపై వివరించారు. ఆడపిల్లలకు, మహిళలకు ఎటువంటి కష్టం కలిగినా 100, 1098, 181112 హెల్ప్‌లైన్ నెంబర్లుకు సమాచారం అందించాలన్నారు. ఆపద సమయంలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తంగా ఒన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అవగాహనతో ఎయిడ్స్ నియంత్రణ

ప్రజాశక్తి- కవిటి

అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ సాధ్యమని వైసిబి పియు ట్రాకర్స్ మేనేజర్ ఎం.మాధవరావు అన్నారు. ఐఇసి 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సహకారంతో బుధవారం ఆర్.బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధికాదని, దానిపై అనుమానాలు, అపోహలు వద్దని అన్నారు. దీనిపై అవగాహన పెంచుకుని ఎయిడ్స్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమిత కుమారి సాహు, ప్రాజెక్ట్ సిబ్బంది ఎన్ని రవికుమార్, ఎం.హాసనుల్లా, కె.కృష్ణారావు పాల్గొన్నారు.


నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

265 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో కెజిబివిలో 265 మంది విద్యార్థినులకు సంతబొమ్మాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.సంధ్యారాణి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నేత్ర వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. దృష్టిలోపం ఉన్నట్లయితే ముందుగానే గుర్తించి కళ్లద్దాల ద్వారా సవరిస్తామన్నారు. ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ విద్యార్థినులకు నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న 34 మందిని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. విద్యార్థులకు 'కంటి ఆరోగ్యం-సంరక్షణ'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.సుజాత, ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆ లేఅవుట్లకు అనుమతుల్లేవు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో అమీన్‌సాహెబ్‌పేట, బెల్లుపడ రెవెన్యూ పరిధిలో వేసిన పలు లేఅవుట్లకు అనుమతులు లేవని కమిషనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేని లేఅవుట్లలోని ప్లాట్లు అమ్మకాలు, కొనుగోలు చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ఈ లేఅవుట్లలో ఇళ్లు నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని లేఅవుట్లకూ కచ్చితంగా అనుమతులు ఉండాలన్నారు. తర్వాత ఎటువంటి కట్టడాలు నిర్మించిన తొలగిస్తామని అన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలో మహిళలకు రక్షణ లేకుండాపోతోందని పౌరసంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. కోల్‌కతా వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఆశాదీపిక ఫౌండేషన్ ఆధ్వర్యాన వివిధ సంఘాల ప్రతినిధులు నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆశాదీపిక ఫౌండేషన్ అధ్యక్షులు నల్లి ఆశాదీపిక మాట్లాడుతూ మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరగకుండా కఠినమైన చట్టాలు రావాలన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించినంత వరకు పాలకులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ మహిళా లోకంపై జరిగే దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ నల్లి రవికుమార్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో వైద్య సేవలు అందించే విద్యార్థినిపై జరిగిన ఘటన మహిళా లోకానికే అవమానమని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాలకులు చూడాలన్నారు. మహిళల రక్షణకు మరిన్ని మంచి చట్టాలు రావాలని లయన్స్ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్ అన్నారు. బిసి సంఘాల నేత రౌతు శంకరరావు, మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు డోల శంకరరావు, రాధాకుమారి, ఖుంగ్ ఫూ, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు హేమంత్, ఎన్.చంద్రరావ్, గాయత్రి, చందు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సిఐలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పాండ్రంకి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మన్యం జిల్లా ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా విధులు నిర్వహించిన వాయునందన్ దివాకర్ యాదవ్ విశాఖపట్నం విఆర్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణకు పోలీస్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం సిఐగా మీసాల చిన్నంనాయడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సిఐగా పనిచేసిన ఇమ్మాన్యుల్‌రాజు బాదిలీ అయ్యారు. చిన్నంనాయుడు గతంలో రూరల్ ఎస్ఐగా పనిచేశారు. ఇప్పుడు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి సిఐగా వచ్చారు. ఈ మేరకు సర్కిల్ పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు.

పలాస : కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ లో బుధవారం సిఐగా గాడి మోహనరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2006లో ట్రైనీ ఎస్ఐగా కాశీబుగ్గలో పనిచేశానని అన్నారు. మున్సిపాలిటీ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. అందరి సహకారంతో నేర రహిత పలాస చేయడానికి పాటు పడతానన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐలు సత్యనారాయణ, చిన్నంనాయడు, మోహనరావు

ఎంపిడిఒగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పివివి మురళీమోహన్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ రత్నం విజయనగరం జిల్లాకు బదిలీ కాగా ఎఒ బివిఎస్ ప్రసాదరావు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహించారు. సరుబుజ్జిలి ఎంపిడిఒగా మురళీమోహన్ కుమార్ రావడంతో బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ కుమార్‌కు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులతో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని జూనియర్ కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో కోరారు. ఆంగ్లం, ఒకేషనల్ కామర్స్ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలని తెలిపారు. ఒక సెట్ ఒరిజినల్ పత్రాలు, ఫోటోతో సహా బయోడేటాను నేరుగా ఈ నెల 23న సాయంత్రం నాలుగు గంటలలోపు ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. ఈ పోస్టులకు విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి ఆసక్తి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వరదా శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఫిమేల్ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులకు వచ్చి ఉండాలన్నారు. ఒక సెట్ నక్కల పత్రాలు, ఫోటోలతో బయోడేటాను నేరుగా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలల అందజేయాలన్నారు. విశ్రాంత ఆచార్యులు అధ్యాపకులకు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని జూనియర్ కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి గణితశాస్త్రం అతిథి అధ్యాపకుడిగా పనిచేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాడుగుల నాగేందర్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 23న సాయంత్రం నాలుగు గంటలలోపు ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటాతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ (గ్రూప్‌లో కామర్స్-1 గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.సంతోషి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఎంకాంలో 50 శాతం ఉత్తీర్ణత ఉన్నవారు అర్హులని అన్నారు. అభ్యర్థులు ఒక సెట్ నకలు పత్రాలు, ఫొటోలతో సహా బయోడేటాను నేరుగా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రతి ఎన్ఎస్ఎస్ వాలంటీరూ తన తల్లి పేరు ఒక మొక్కను నాటి ఆ మొక్కను తల్లిని చూసుకున్నట్లు చూడాలని నైర వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. స్థానిక నైర వ్యవసాయ కళాశాలలో తన తల్లి పేరున జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన బుధవారం మొక్కను నాటారు. కళాశాల మొదటి సంవత్సరం వంద మంది విద్యార్థులు వంద మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ ఎస్.గోవిందరావు, బి.స్పందన, అధ్యాపకులు డాక్టర్ ఎ.ఉపేంద్రరావు, శ్రీనివాసరావు, లక్ష్మీదుర్గా, వై.రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మొక్కలతోనే మానవాళి మనుగడని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రవి కుమార్ అన్నారు. ఢిల్లీకి చెందిన గూంజ్ వారి సహకారంతో సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యాన మొక్కల పంపిణీ కార్యక్రమం సింగుపురం వివేకానంద క్రీడ మైదానంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని స్థానికులకు సూచించారు. మొక్కలు నాటాలన్న సిక్కోలు స్వచ్ఛంద సంస్థ సంకల్పం భావితరాలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గూంజ్ సంస్థ సభ్యులు, సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీన్ భరతలక్ష్మి

విలువలతో కూడిన విద్య అవసరం

పలాస : ప్రస్తుత సమాజంలో విలువలతో కూడిన విద్య నేర్చుకోవడం అవసరమని, విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలని వైద్యులు హెచ్.రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక శ్రీవిద్యా వాహిని జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన స్వాగతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఉర్రూతలూగించాయి. కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తిరుమలరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు, బి.కోదండరావు, బి.దుర్యోధనరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యులు రాజ్‌కుమార్


ఆమదాలవలస : పంట పొలాల్లో జిగురు అట్టలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ముందుజాగ్రత్త చర్యలు తప్పనిసరి

ఆమదాలవలస : పంటలకు పురుగులు, తెగుళ్లు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లువాడ, కొత్తవలస, జి.కె వలస గ్రామాల్లో యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో పంట పొలాల్లో జిగురు పూసిన పసుపు అట్టలను, పక్షి స్థావరాలను ఏర్పాటు చేశారు. ఇలా పంట పొలాల్లో పెట్టడం వలన దోమ ఉధృతుని తెలుసుకోగలమన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ముందు జాగ్రత్తగా పంటలో అవసరమైన రాజీలేని సూత్రాలను పాటించినట్లయితే పంటకు ఎటువంటి పురుగులు, తెగుళ్లు రాకుండా అధిక దిగుబడులు పొంద వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: వరి పంటలో మేలైన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ లక్షుంనాయుడు అన్నారు. ఎచ్చెర్లలోని ప్రకృతి వ్యవసాయ భాగంలో భాగంగా సిబ్బంది బుధవారం వరి పంటను పరిశీలించారు. పంటలో జిగురుపూసిన పసుపు అట్టలను, పక్షి స్థావరాలకు గూడులను ఏర్పాటు చేశారు. వీటి వల్ల పంటలో వచ్చే దోమ, ఇతర పురుగు ఉధృతిని తెలుసుకోవచ్చునని అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మేలైన యాజమాన్య విధానాలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సన్యాసిరావు, తులసి, ధనుంజయ, హరేరామ్, సువారి సన్యాసిరావు, సత్యవతి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా గైర్హాజరుపై చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న జి.రామచంద్ర 2021 ఆగస్టు ఒకటో తేదీ నుంచి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న తిరిగి విధుల్లో చేరి 28 నుంచి గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా విచారణ సమయంలోనూ హాజరు కాలేదని, పది రోజుల్లో ఆయన విధుల్లో చేరకపోతే క్రమశిక్షణా చర్యలకు లోబడి శాశ్వతంగా తొలగించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యవంత జీవనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యవంతమైన జీవనాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సమతుల్య పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని హెర్బల్ లైఫ్ న్యూట్రిషన్ ఎన్‌వివి మహేష్ అన్నారు. బుధవారం పిఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో జుంబా డాన్స్ కోచ్ బి.దేవి ప్రసాద్ ఆధ్వర్యాన ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలోని 11 కెవి గాజుల కొల్లివలస రూరల్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి మునగవలస ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించుట, విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 23న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ శాఖ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గాజుల కొల్లివలస, జొన్నవలస, మునగవలస, రాధాకృష్ణాపురం, రామచంద్రాపురం, పొన్నంపేట, చిట్టివలస, సైలాడ, కుమ్మరిపేట, చెవ్వాకులపేట, అక్కులపేట, తాళ్లవలస, మండాది తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

సంధ్య ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

తెలుగు భాష దినోత్సవ సంబరాల కవి సమ్మేళనంలో మండలంలోని మాణిక్యపురానికి చెందిన యువ కవియత్రి, రచయిత్రి సాహు సంధ్య తన ప్రతిభతో ఆకట్టుకుంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా - అమలాపురంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన మంగవారం రాత్రి 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పాల్గొన్న సంధ్య తెలుగు భాష విశిష్టతను వచన రూపంలో కవితగా ఆలపించారు. సంధ్య కవితకు ముగ్ధులైన కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సంస్థ బృందం అభినందించారు. గౌరవంగా దుశ్శాలువ కప్పి జ్ఞాపిక, ప్రశంశాపత్రంతో ఘనంగా సన్మానించారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రతాప్


మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్ నాయుడు

డ్రాపౌట్స్ గుర్తింపు

పలాస : మండలంలోని పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 2,166 డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించామని ఎంపిడిఒ ఎస్.రమేష్ నాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యార్థులు ఆన్‌లైన్ యూడైస్‌లో లేకపోవడంతో ప్రస్తుతం బడిబయట పిల్లలుగా గుర్తించామన్నారు. ప్రస్తుతం ఆ విద్యార్థుల తల్లిదండ్రులు, వారి చదువుతున్న పూర్వ పాఠశాల సిబ్బంది, సిఆర్ఎంటిల సమన్వయంతో వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించామన్నారు. వారి పేర్లు ఆన్‌లైన్ చేసే బాధ్యత తప్పక తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, సిహెచ్.సత్యం, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

బూర్జ : మండలంలోని నీలాదేవిపురంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజశేఖర్ 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజిని, పిహెచ్ఒ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్